# ఐపీవోకి లలితా జ్యువెల్లరీ

న్యూఢిల్లీ, జూన్ 9: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ లలితా జ్యువెల్లరీ..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమైంది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. ఈ వాటాల విక్రయం ద్వారా గరిష్ఠంగా రూ.1,700 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. దీంట్లో తాజా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.1,200 కోట్లు, కంపెనీ సీఎండీ కిరణ్ కుమార్ జైన్‌కు చెందిన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్లను సేకరించాలని నిర్ణయించింది. ఈ విషయం సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్(డీఆర్‌హెచ్‌పీ)లో వెల్లడించింది. అర్హత కలిగిన ఉద్యోగులకు రాయితీతో కూడిన షేర్లను కేటాయించనున్నది సంస్థ. ఈ వాటాల విక్రయంతో వచ్చిన నిధుల్లో రూ.1,014.50 కోట్లను నూతన స్టోర్లను ఏర్పాటు చేయడానికి, కార్పొరేట్ అవసరాల నిమిత్తం వినియోగించనున్నట్టు ప్రకటించింది. 1985లో చెన్నైలో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ..ప్రస్తుతం తన స్టోర్ల సంఖ్యను 56కి పెంచుకున్నది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తమిళనాడులో 20, కేరళలో ఏడు, తెలంగాణలో ఆరు, పుదుచ్చేరిలో ఒక్క స్టోర్‌ను నిర్వహిస్తున్నది. డిసెంబర్, 2024తో ముగిసిన తొమ్మిది నెలల కాలానికిగా సంస్థ రూ.12,594.67 కోట్ల ఆదాయంపై రూ.262.33 కోట్ల నికర లాభాన్ని గడించింది.

## 13 నుండి 'స్టైల్ తత్వ'

అమీర్‌పేట్, జూన్ 9 : ఎఫ్ఐసీసీఐ లేడీస్ ఆర్గనైజేషన్(ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహిస్తున్న 'స్టైల్ తత్వ' ఐదో ఎడిషన్ ఈ నెల 13, 14 తేదీల్లో హైటెక్స్‌లోని హాల్ 2లో జరగనుంది. సిగ్నేచర్ ఫ్యాషన్, లైఫ్ స్టైల్ ఎగ్జిబిషన్‌కు సంబంధించిన వివరాలను సోమవారం ఎఫ్ఎల్‌వో హైదరాబాద్ అధ్యక్షురాలు ప్రతిభా కుందా వివరించారు. ఈ రెండు రోజుల ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా 205 మంది పాల్గొంటున్నారని, వీరిలో ఫ్యాషన్, డెకర్, హ్యాండ్‌లూమ్, ఆభరణాలు, హోమ్ లీవింగ్, కళాత్మక ఉత్పత్తుల విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను ప్రదర్శించనున్నారు. 10 వేల మందికి పైగా సందర్శకులు ఈ ఎగ్జిబిషన్లో తిలకించేందుకు వస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు.

## బీమా సంస్థల రికార్డు

న్యూఢిల్లీ, జూన్ 9: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో జీవిత బీమా సంస్థలు రికార్డు స్థాయిలో నూతన బిజినెస్ ప్రీమియంను వసూళ్లు చేశాయి. ఏప్రిల్, మే నెలల్లో జీవిత బీమా సంస్థలు 10.8 శాతం మేర నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో వృద్ధిని సాధించాయి. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఒక మే నెలలోనే 12.6 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషం. దీంతో గత నెలలో నూతన బిజినెస్ ప్రీమియం ఆదాయం రూ.27,034 కోట్ల నుంచి రూ.30,463 కోట్లకు పెరిగాయి. మొత్తం ప్రీమియం వసూళ్లు రూ.47,293 కోట్ల నుంచి రూ.52,427 కోట్లకు చేరుకున్నాయి.

# దిగొస్తున్నాయ్..

**ఆర్ఆర్ఎల్ఆర్, ఎంసీఎల్ఆర్‌లకు కోత పెడుతున్న ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకర్లు**

**10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింపులు**

**దిగుతున్న లోన్ టెన్యూర్, ఈఎంఐల భారం**

న్యూఢిల్లీ, జూన్ 9: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును అర శాతం కోత పెట్టిన నేపథ్యంలో ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులూ తమ రుణాలపై వడ్డీరేట్లను తగ్గిస్తున్నాయి. గత వారం జరిగిన ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షలో రెపోను ఆర్బీఐ 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, కరూర్ వైశ్యా బ్యాంకులు రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆధారిత రుణాలపై, మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) ఆధారిత లోన్లపై వసూలు చేస్తున్న వడ్డీరేట్లకు 10 నుంచి 50 బేసిస్ పాయింట్లదాకా కత్తెర వేశాయి.

### బ్యాంక్ ఆఫ్ బరోడా

బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) తమ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. తగ్గిన వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే వర్తిస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ తెలిపింది. ఆర్ఆర్ఎల్ఆర్ అనుసంధానంగా ఈ బ్యాంక్‌లో లోన్లు తీసుకున్న రుణగ్రహీతలందరికీ ప్రయోజనం చేకూరుతుంది. కాగా, ప్రస్తుతం బీవోబీ ఆర్ఆర్ఎల్ఆర్ 8.15 శాతంతో మొదలవుతున్నది.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రైవేట్ రంగ బ్యాంక్ హెచ్‌డీఎఫ్‌సీ ఎంసీఎల్ఆర్ అన్ని కాలపరిమితులపై 10 బేసిస్ పాయింట్లు తగ్గింది. ఈ నెల 7 నుంచే తగ్గిన వడ్డీరేటు అమల్లోకి వచ్చింది. దీంతో ఎంసీఎల్ఆర్ ఆధారంగా రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకు ఈ నిర్ణయం లాభిస్తుంది. కాగా, ప్రస్తుతం ఓవర్‌నైట్, నెల ఎంసీఎల్ఆర్ 8.90 శాతంగా ఉన్నాయి. 3 నెలలది 8.95 శాతానికి, 6 నెలలు, ఏడాది టెన్యూర్ 9.05 శాతంగా ఉన్నాయి. రెండేండ్లు, మూడేండ్ల టెన్యూర్స్‌పై వడ్డీరేటు 9.10 శాతంగా ఉన్నది. ఇదిలావుంటే ఆర్ఆర్ఎల్ఆర్‌నూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 50 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయి. దీని ఆధారంగా రుణాలు తీసుకున్నవారికి వచ్చే నెల నుంచి ఈ లాభం అందనున్నట్టు తెలుస్తున్నది.

### పంజాబ్ నేషనల్ బ్యాంక్

ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ఆర్ఆర్ఎల్ఆర్ 50 బేసిస్ పాయింట్లదాకా తగ్గింది. సోమవారం నుంచే ఇది అమల్లోకి వచ్చింది. దీంతో గృహ రుణాలపై వడ్డీరేటు 7.45 శాతం నుంచి మొదలవుతుండగా, వాహన రుణాలపై 7.80 శాతం నుంచి ప్రారంభమవుతున్నది.

### యూకో బ్యాంక్

అన్ని రకాల టెన్యూర్స్‌పై యూకో బ్యాంక్ ఎంసీఎల్ఆర్ తగ్గింది. తగ్గిన వడ్డీరేట్లు మంగళవారం నుంచి అమల్లోకి వస్తాయని ఈ ప్రభుత్వ రంగ బ్యాంక్ ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. నెల ఎంసీఎల్ఆర్ 8.35 శాతానికి, ఓవర్‌నైట్ 8.15 శాతానికి, 3 నెలలు 8.50 శాతానికి, 6 నెలలు 8.8 శాతానికి, ఏడాది ఎంసీఎల్ఆర్ 9 శాతానికి దిగొస్తున్నాయి. అయితే సోమవారం నుంచే ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించినట్టు బ్యాంక్ వెల్లడించింది. ప్రస్తుతం ఇది 8.30 శాతంగా ఉన్నది.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా

బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీవోఐ) ఆర్ఆర్ఎల్ఆర్‌ను 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. ప్రస్తుతం ఈ వడ్డీరేటు 8.35 శాతంతో మొదలవుతున్నది. తగ్గించిన వడ్డీరేటు ఈ నెల 6 నుంచే అమల్లోకి వచ్చిందని ఈ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ తెలిపింది.

### కరూర్ వైశ్యా బ్యాంక్

6 నెలల ఎంసీఎల్ఆర్‌ను 10 బేసిస్ పాయింట్లు, ఏడాది ఎంసీఎల్ఆర్‌ను 20 బేసిస్ పాయింట్లు కోతపెట్టి 9.80 శాతానికి తీసుకొచ్చింది ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ కరూర్ వైశ్యా బ్యాంక్. కొత్త వడ్డీరేట్లు ఈ నెల 7 నుంచే అమల్లోకి వచ్చాయి.

### *ఆర్ఆర్ఎల్ఆర్ అంటే?*

*రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఆర్ఎల్ఆర్) ఆర్బీఐ రెపోరేటు ఆధారంగా ఉంటుంది. రిజర్వ్ బ్యాంక్ రెపోరేటును తగ్గిస్తే ఇది తగ్గుతుంది. పెంచితే పెరుగుతుంది. ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్ల (ఈబీఎల్ఆర్)లో ఆర్ఆర్ఎల్ఆర్ కూడా ఒకటి.*

### *ఎంసీఎల్ఆర్ అంటే?*

*మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను ఆర్బీఐ మార్గదర్శకాలను అనుసరించి బ్యాంకులే నిర్ణయిస్తాయి. దీన్ని ఇంటర్నల్ బెంచ్ మార్క్ లెండింగ్ రేటు (ఐబీఎల్ఆర్)గా కూడా పరిగణిస్తారు. బ్యాంక్ ఆర్థిక పరిస్థితి, అందుబాటులో ఉన్న నిధులు, వాటికయ్యే ఖర్చులపై ఈ వడ్డీరేటు ఆధారపడి ఉంటుంది.*

## క్వాంటమ్ ఎనర్జీ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, జూన్ 9: హైదరాబాద్‌కు చెందిన ఈవీ స్టార్టప్ క్వాంటమ్ ఎనర్జీ లిమిటెడ్ తన ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచింది. నగరానికి సమీపంలోని మహేశ్వరం వద్ద ఉన్న ప్లాంట్ కెపాసిటీని 2 లక్షల యూనిట్లకు పెంచుకున్నది. దేశీయంగా కంపెనీకి చెందిన ఈవీలకు డిమాండ్ అధికంగా ఉండటంతో 2.4 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నెలకొల్పిన ఈ యూనిట్ సామర్థ్యం పెంచడంతో మరింత మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని కంపెనీ ఎండీ చక్రవర్తి చుక్కపల్లి తెలిపారు. ప్రస్తుతం సంస్థ ప్లాజ్మా, మిలాన్, బిజినెస్ పేర్లతో పలు మాడళ్లను విక్రయిస్తున్నది.

## షిప్‌రాకెట్ డార్క్ స్టోర్

హైదరాబాద్, జూన్ 9: దేశంలో అతిపెద్ద ఈ-కామర్స్ సంస్థల్లో ఒకటైన షిప్‌రాకెట్.. హైదరాబాద్‌లో డార్క్ స్కోర్‌ను ఏర్పాటు చేయబోతున్నది. కస్టమర్లు బుకింగ్ చేసుకున్న వస్తువులను వేగవంతంగా అందించాలనే ఉద్దేశంతో ఇప్పటికే న్యూఢిల్లీ, బెంగళూరు, ముంబైలలో ఈ డార్క్ స్టోర్లను ఏర్పాటు చేయగా..తాజాగా త్వరలో హైదరాబాద్‌తోపాటు చెన్నై, మిగతా నగరాల్లో నెలకొల్పబోతున్నట్టు కంపెనీ సీఈవో అతుల్ మెహతా తెలిపారు. తెలంగాణతోపాటు ఏపీల్లో 18 వేల విక్రయదారులకు సంబంధించిన ఉత్పత్తులను అందుబాటులోవుంచినట్టు చెప్పారు.

## హైదరాబాద్‌లో హైలాండ్ నూతన ఆఫీస్

హైదరాబాద్, జూన్ 9: అమెరికాకు చెందిన టెక్నాలజీ సేవల సంస్థ హైలాండ్..భారత్ తన తొలి కార్యాలయాన్ని హైదరాబాద్‌లో సోమవారం ప్రారంభించింది. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా నగరంలో నెలకొల్పిన ఈ నూతన సెంటర్‌ను అమెరికా కౌన్సిల్ జనరల్ ఫర్ హైదరాబాద్ జెన్నిఫర్ లార్సన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హైలాండ్ సీటీవో టిం మెకింటైర్ మాట్లాడుతూ..హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి టెక్నాలజీ ఎకోసిస్టాన్ని నెలకొల్పినట్టు చెప్పారు.



# నాలుగో రోజూ లాభాల్లో సూచీలు

## సెన్సెక్స్ 255, నిఫ్టీ 100 పాయింట్ల లాభం

ముంబై, జూన్ 9: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా నాలుగో రోజూ లాభాల్లో ముగిశాయి. రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించడంతో బ్యాంకింగ్, ఆర్థిక రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మార్కెట్లను ముందుకు నడిపించాయి. ఇంట్రాడేలో 500 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 256.22 పాయింట్లు అందుకొని 82,45.21 వద్ద ముగిసింది. ఎస్ఎన్ఈ నిఫ్టీ 100.15 పాయింట్లు ఎగబాకి 25,103.20 వద్ద స్థిరపడింది. గడిచిన నాలుగు రోజుల్లో సెన్సెక్స్ 1,707 పాయింట్లు లేదా 2 శాతం, నిఫ్టీ 560 పాయింట్లు లేదా 2.27 శాతం చొప్పున పెరిగాయి. ప్రతీకార సుంకాలపై అమెరికా-చైనా దేశాల మధ్య మరోసారి చర్చలు జరుగుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. గడిచిన వారంలో ఆర్బీఐ కీలక వడ్డీరేట్లను అర శాతం తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం మదుపరుల్లో ఉత్సాహాన్ని ఇచ్చిందని, ముఖ్యంగా ఎనర్జీ, ఐటీ, ఆర్థిక రంగ షేర్లు కదంతొక్కాయని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి.

- కొటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఇండస్ఇండ్, మారుతి, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్‌టీపీసీ షేర్లు లాభాల్లో ముగిశాయి.
- కానీ, ఎటర్నల్, ఐసీఐసీఐ బ్యాంక్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, టాటా స్టీల్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టపోయాయి.

# మారని మైక్రోఫైనాన్స్ సంస్థల తీరు

**అధిక వడ్డీరేట్లు, కఠిన రికవరీలు ఆగట్లేదు: ఆర్బీఐ డీజీ ఎం రాజేశ్వర్ రావు**

ముంబై, జూన్ 9: సూక్ష్మ రుణ సంస్థల్లో (మైక్రోఫైనాన్స్ కంపెనీలు) అధిక వడ్డీరేట్లు, బాకీల వసూళ్లకు అవలంబిస్తున్న కఠిన చర్యలు ఆగట్లేదని, వీటివల్లే మైక్రోఫైనాన్స్ రంగం ఇబ్బందుల్లో పడుతున్నదని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ల (డీజీ)లో ఒకరైన ఎం రాజేశ్వర్ రావు అన్నారు. ఇటీవల జరిగిన హెచ్ఎస్‌బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఫైనాన్షియల్ ఇంక్లూజన్‌లో మైక్రోఫైనాన్స్ కీలకపాత్ర పోషిస్తున్నదన్నారు. అయినప్పటికీ మైక్రోఫైనాన్స్ కంపెనీల అభ్యంతరకర తీరు మారట్లేదన్నారు. నిజానికి మైక్రోఫైనాన్స్ కంపెనీలకు నిధులు తక్కువ వడ్డీకి, సులువుగా లభ్యమవుతున్నా.. రుణాలపై అధిక వడ్డీరేట్లు వసూలు చేస్తున్నారని, రుణగ్రహీతలపై మితిమీరిన భారం మోపుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు ఎన్నో ఘటనలు సాక్ష్యంగా ఉన్నాయన్న ఆయన.. కొన్ని మైక్రోఫైనాన్స్ సంస్థల అకృత్యాలకు అడ్డుకట్ట పడాల్సి ఉన్నదని వ్యాఖ్యానించారు. వెనుకబడిన ఆదాయ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ఉండాల్సిన మైక్రోఫైనాన్స్ కంపెనీలు.. ధనార్జనే లక్ష్యంగా ముందుకెళ్తుండటం విచారకరమని పేర్కొన్నారు. ఇక బీమా పాలసీలనూ విక్రయిస్తున్నారన్నదానిపై స్పందిస్తూ ఆర్బీఐ దీనికి సంబంధించి తగు మార్గదర్శకాలను విడుదల చేయాలని చూస్తున్నట్టు చెప్పారు.

## ఇంటింటికీ నీళ్లు, డ్రైనేజీ సదుపాయాలు

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

చొప్పదండిలో 'వాటర్ ఇంప్రూవ్ మెంట్' స్కీంకు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంతో కలిసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

చొప్పదండి, జూన్ 9: అమృత్ 2 పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా పట్టణాల్లో ఇంటింటికీ నీళ్లు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడించారు. సోమవారం చొప్పదండి పట్టణంలోని నల్లాలబావి వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభతో కలిసి రూ.36.3 కోట్ల వ్యయంతో 'వాటర్ ఇంప్రూవ్ మెంట్' స్కీంకు కేంద్ర మంత్రి శంకుస్థాపన, భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, ఈ స్కీం కింద కేంద్ర, రాష్ట్రాలు, మున్సిపాలిటీల భాగస్వామ్యంతో ఆయా వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ స్కీం ద్వారా చొప్పదండి పట్టణంలో 2,800 నల్లా కనెక్షన్లకు నీటిని సరఫరా చేయబోతున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో రాష్ట్రంలోనే ఒక మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేశ్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ గుర్రం నీరజ-భూంరెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## హత్యాయత్నం నేరంలో నలుగురికి రెండేండ్ల జైలు

కోర్టుచౌరస్తా, జూన్ 9: ఆస్తి విషయంలో సొంత తమ్ముడితోపాటు అతడి బావమరిదిపై హత్యాయత్నానికి పాల్పడిన నేరంలో నిందితులకు రెండు సంవత్సరాల జైలు శిక్ష, ఒక్కొక్కరికి 1000 చొప్పున జరిమానా విధిస్తూ కరీంనగర్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కే రాణి సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చొప్పదండి మండలం ఆర్నకొండకు చెందిన ముగ్గురు అన్నదమ్ముల్లో కనకట్ల రమేశ్ చిన్నవాడు. అతడు కులాంతర వివాహం చేసుకోగా, అతడి అన్నలు కనకట్ల మహేశ్, సురేశ్‌లకు ఇష్టం లేదు. తమ ఉమ్మడి ఆస్తి మూడు ఎకరాలను తన అన్నలు తనకు తెలియకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, తాను పెళ్లికి ముందు కొన్న 11 గుంటల భూమి ఆక్రమించేందుకు ప్రయత్నించారని రమేశ్ పంచాయితీ పెట్టించగా, పెద్దమనుషులు జరిమానా విధించారు. దీనిపై కక్ష పెంచుకున్న కనకట్ల మహేశ్, స్నేహితుడు దయ్యాల రాజయ్య, అతడి కొడుకులు దయ్యాల మహేశ్, దయ్యాల శేఖర్ 2023 జూన్ 11న రాత్రి రమేశ్‌తో పాటు అతడి బావమరిది బండారి సతీశ్‌పై కత్తులు, రాడ్లు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. రమేశ్ చొప్పదండి పోలీసులకు ఫిర్యాదు చేయగా, నలుగురు నిందితులపై కేసు నమోదైంది. సీఐ రవీందర్ దర్యాప్తు జరిపారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గడ్డం లక్ష్మణ్ కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలు పరిశీలించిన జడ్జి నలుగురికి జైలు శిక్ష, జరిమానా విధించారు.

## అనుమతి లేని పాఠశాలను మూసివేయాలి



ఎస్ఎఫ్ఐ నాయకులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కమాన్‌చౌరస్తా, జూన్ 9 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నడుపుతున్నారంటూ స్థానిక ఓ పాఠశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జల శ్రీకాంత్ మాట్లాడుతూ, జిల్లా విద్యాశాఖ అధికారి అనుమతి లేకుండా ఇష్టానుసారంగా అడ్మిషన్లు చేస్తున్న సదరు పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అడ్డుకొని, అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, ఇసాక్, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, సురేశ్, సన్నీ, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ల విభజనపై అభ్యంతరాల వెల్లువ

- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన పార్టీల నాయకులు

కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ కార్పొరేటర్ శ్రీకాంత్

కార్పొరేషన్, జూన్ 9: కరీంనగర్ నగరపాలక సంస్థలో చేపట్టిన డివిజన్ల పునర్విభజనపై అన్ని పార్టీల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఆయా పార్టీల నేతలు నేరుగా కలెక్టర్, నగరపాలక ప్రత్యేకాధికారి పమేలా సత్పతిని కలిసి ఫిర్యాదు చేశారు. నగరంలో చేపట్టిన 12వ డివిజన్‌లో పద్మనగర్, గాంధీనగర్‌ను కలపడం వల్ల డివిజన్ పరిధి పెరిగిందని, దీనివల్ల భవిష్యత్తులో పారిశుధ్య పనులు, నీటి సరఫరాకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని మాజీ కార్పొరేటర్ బోనాల శ్రీకాంత్ అభ్యంతరం తెలిపారు.

– 3వ డివిజన్‌లో దుర్శేడ్‌లోని 5-1 నుంచి 5-20 వరకు ఇళ్లను మాత్రమే చూపించారని, దుర్శేడ్ గ్రామ పంచాయతీ ప్రకారం 5-78/1 వరకు ఇళ్లు ఉన్నాయని, మిగతా 5-21 నుంచి 5-78 వరకు ఉన్న ఇళ్లను ఏ డివిజన్‌లో అధికారులు చూపించారో చెప్పాలంటూ మాజీ ఉపసర్పంచ్ సుంకిశాల సంపత్‌రావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అలాగే దుర్శేడ్, గోపాల్‌పూర్‌ను కలిపి డివిజన్ చేసిన అధికారులు 900 ఓట్లకు పైగా అసలు ఏ డివిజన్‌లోనూ చూపించడం లేదన్నారు. దుర్శేడ్‌కు అనుసంధానంగా ఉన్న గుంటూర్‌పల్లి కలిపి డివిజన్‌గా రూపొందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

– 42వ డివిజన్‌లో అధికారులు చూపించినట్లు 5 వేల ఓట్లు లేవని మాజీ కార్పొరేటర్ ఎదుర్ల రాజశేఖర్ అభ్యంతరం తెలిపారు. వాస్తవానికి గతంలో 19వ డివిజన్‌గా ఉండగా దీనిలో 3600 ఓట్లు ఉన్నాయని, ఇప్పుడు అందులో నుంచి మూడు కాలనీలను వేరే డివిజన్‌లో కలిపారని, నూతనంగా ఏ డివిజన్ కలుపకుండా 5 వేల ఓట్లు ఎలా వస్తాయని ప్రశ్నించారు.

– 41వ డివిజన్‌లో మూడుకు పైగా ప్రధాన రహదారులను చేర్చారని, 10-2-247 నుంచి 923 వరకు ఉన్న ఇళ్లను తొలగించి 10-3-1 నుంచి 483 ఈ డివిజన్‌లో చేర్చాలని బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు విన్నవించారు.

– కొత్తపల్లి మున్సిపాలిటీని రెండు డివిజన్లుగా విభజించిన అధికారులు అసలు ఆ మున్సిపాలిటీలో లేని 12-1 ఇంటి నంబర్ సిరీస్‌ను చేర్చారని మాజీ చైర్మన్ రుద్రరాజు, జమీలొద్దీన్ ఫిర్యాదు చేశారు. లేని ఇంటి నంబర్లతో కొత్తపల్లిని గజిబిజి డివిజన్లుగా మార్చారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

12 గంటల వరకు కూడా తెరుచుకోని బియ్యం గోదాం

చెట్టు కింద నిరీక్షణ చేస్తున్న డీలర్లు

## బియ్యం కోసం డీలర్ల నిరీక్షణ

హుజూరాబాద్, జూన్ 9: ఒకేసారి మూడు నెలల రేషన్ డీలర్లకూ తలనొప్పిగా మారింది. బియ్యం తీసుకుపోవడానికి డీలర్లు గోదాం వద్ద పడి కాపులు కాయాల్సి వస్తున్నది. సోమవారం బియ్యం కోసం పలు గ్రామాల నుంచి డీలర్లు ఉదయం 10:30 గంటలకు హుజూరాబాద్‌లోని గోదాంకు చేరుకున్నారు. గోదాం ఇన్‌చార్జి, డిప్యూటీ తాసిల్దార్ ప్రేమలత 12 గంటలకు రావడంతో అప్పటి వరకు డీలర్లు చెట్ల కింద నిరీక్షించారు. దీనిపై ఆమెను అడగగా, మొదటగా బియ్యం స్టాకు లేదని, ఆ తర్వాత మాట మార్చి ఆరోగ్యం బాగాలేక ఆలస్యంగా వచ్చానని చెప్పారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ కూడా బియ్యం గోదాంలో నిలువ లేవని, అందుకే గోదాం తాళాలు తీయలేదని చెప్పడం గమనార్హం. కాగా, మూడు నెలల స్టాకు ఒకేసారి తీసుకెళ్దాం అంటే నిల్వ చేసుకునేందుకు స్థలం లేదని, రెండు దఫాలుగా తీసుకెళ్లడానికి వస్తే గోదాంలో స్టాక్ ఉండడం లేదని డీలర్లు వాపోతున్నారు.



రుద్రారం ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



శంకరపట్నం: తాడికల్ హైస్కూల్‌లో చదివిన 2004-05 ఎస్సెస్సీ విద్యార్థులు, ఉపాధ్యాయులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు

రామడుగు, జూన్ 9 : మండలంలోని రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హాజరైన నాటి ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు డబిరొద్దీన్, రాంరెడ్డి, వెంకటనర్సయ్య, నర్సింహారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

శంకరపట్నం, జూన్ 9: మండలంలోని తాడికల్ గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు సోమవారం మొలంగూర్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కలుసుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులు సదానందం, రామానుజన్, రాంప్రసాద్, భాస్కర్‌రావు, పుల్లారెడ్డి, ప్రవీణ్‌ను ఘనంగా సత్కరించారు. ఆటపాటలతో రోజంతా సందడి చేశారు.

## మౌలిక వసతుల కల్పనలో వేగం పెంచాలి

కలెక్టరేట్, జూన్ 9: జిల్లాలోని పలు ప్రభుత్వ భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో వేగం పెంచాలని, కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వివిధ కార్యక్రమాలు, పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు, టాయిలెట్లు, కిచెన్‌షెడ్లు, భవనాల మరమ్మతులు, కొత్త భవనాల నిర్మాణాలకు పనులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. వీటికి సంబంధించిన గ్రౌండింగ్ వందశాతం పూర్తి చేయాలన్నారు. ఏఈలు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో విధులు నిర్వహిస్తూ పనులు మొదలయ్యేలా చూడాలన్నారు. ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో వేగం పెంచి, రెండు నెలల్లో నిర్మాణం పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షం కారణంగా నీరు నిల్వకుండా చూడాలని, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు తనిఖీ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, డీఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి పవన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో గడ్డం సుధాకర్, తదితరులు ఉన్నారు.

### *పెట్రోల్ పంపుల ఏర్పాటుకు స్థల గుర్తింపు పూర్తి*

జిల్లాలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెట్రోల్ పంపులు ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం రెండుచోట్ల గుర్తించినట్లు, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంపై పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో పంపుల ఏర్పాటుపై సాధ్యాసాధ్యాల నివేదిక రాగానే ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. సమీక్షా సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి సరస్వతి, మెప్మా పీడీ వేణుమాధవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వంద రోజుల ప్రణాళిక విజయవంతం చేయాలి



నగరంలో వంద రోజుల కార్యక్రమాలను పరిశీలిస్తున్న సీడీఎంఏ జేడీ శ్రీనివాస్

కార్పొరేషన్, జూన్ 9: కరీంనగర్ నగరపాలక సంస్థలో 100 రోజుల ప్రణాళికను విజయవంతంగా పూర్తి చేయాలని సీడీఎంఏ జాయింట్ డైరెక్టర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. సోమవారం వంద రోజుల ప్రణాళికను పరిశీలించేందుకు స్పెషల్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ నగరంలో పర్యటించారు. స్థానిక పద్మనగర్ ప్రాంతంలో ఇటీవల మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో ప్లాంటేషన్ చేసిన ప్రకృతి వనాన్ని సందర్శించారు. అనంతరం సప్తగిరి కాలనీలో గల పార్కును పరిశీలించారు. పార్కులో గ్రీనరీని పెంచాలని అధికారులకు సూచించారు. హౌజింగ్ బోర్డు రిసోర్స్ పార్కుతో పాటు ఎస్ఆర్ఆర్ సమీపంలోని రిజర్వాయర్‌ను సందర్శించారు. డీఆర్‌సీసీ సెంటర్లను తనిఖీ చేశారు. టవర్‌సర్కిల్, మార్కెట్ ఏరియాలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ వెండర్స్ మేళాలో పాల్గొన్నారు. అనంతరం కార్యాలయంలో రెవెన్యూ, ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం వంద రోజుల కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని పరిశుభ్రం చేస్తూ పచ్చదనం పెంచాలన్నారు. నగరంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉన్నా మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. నగరంలో నల్లాలు లేని నివాస గృహాలకు నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, వాటిని వెంటవెంటనే ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అన్ని వ్యాపార దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మోహియొద్దీన్, డీఈ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు

కొత్తపల్లి, జూన్ 9 : మండలంలోని చింతకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆనందం, ప్రధానోపాధ్యాయిని శోభారాణి, ఫిజికల్ డైరెక్టర్ అంతడుపుల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.